

క్రీడలతో మానసిక ఉల్లాసం

నెహ్రూ యువకేంద్ర ఆధ్వర్యంలో ఒంగోలు డీఆర్ఆర్ఎం మున్సిపల్ హైస్కూల్లో జిల్లా స్థాయి వాలీబాల్, కబడ్డీ, పరుగు పోటీలు నిర్వహించారు.

- 8లో..



పరీక్షల విధుల్లో అలసత్వం వహించొద్దు

ఇంటర్మీడియెట్ పరీక్షల విధుల్లో అలసత్వం వహించొద్దని కలెక్టర్ తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు.

- 8లో..

గరిష్టం/కనిష్టం
35/23

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది. చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో ఒంగోలు విద్యార్థుల ప్రతిభ



జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో సత్తాచాటిన ఒంగోలు విద్యార్థులు

ఒంగోలు: జాతీయ ఓపెన్ కరాటే పోటీల్లో ఒంగోలు విద్యార్థులు సత్తాచాటారు. చిలకలూరిపేటలోని ఆర్యవైశ్య కళ్యాణమండపంలో పునా కొషి షోటోకాన్ కరాటే వారు ఆదివారం జాతీయ స్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో ఒంగోలు విద్యార్థులు 14 మంది వివిధ కేటగిరీల్లో కటాస్ విభాగంలో పాల్గొని పతకాలు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వీరిని జపాన్ కరాటే అసోసియేషన్ సౌత్ ఇండియా చీఫ్ రాపోలు సుదర్శన్, గుంటూరు జిల్లా కార్యదర్శి కె.రఘునాథ బాబు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు టి.శ్రీనివాస రెడ్డి తదితరులు అభినందించారు.

పతకాలు సాధించిన బాలికలు:
ఎన్ఎస్ఎస్ దీపాంజలి-అండర్ 14 బంగారు పతకం, ఎస్.ప్రశాంతి-అండర్ 12 బంగారు పతకం, జి.చాతుర్య అండర్ 14 వెండి, కె.అనన్య-అండర్ 14 వెండి, సీహెచ్ అక్షర-అండర్ 14 కాంస్య, సీహెచ్ హేమప్రియ అండర్-14 కాంస్య టి.జ్యోషిత-అండర్ 10 కాంస్య, ఈ.దేదీప్య-అండర్ 8 కాంస్య.

పతకాలు సాధించిన బాలురు:
డి.యశ్వంత్-అండర్ 14 బంగారు పతకం, వి.గౌతం వర్షిత్-అండర్ 10 బంగారు, పి.తేజ వర్ధన్-అండర్ 12 వెండి, కె.ప్రజ్వల- అండర్ 11 కాంస్య, పి.లేఖన్-అండర్ 10 కాంస్య, పి.మన్విత్-అండర్ 10 కాంస్య మెడల్.

పరీక్ష.. ప్రహసనం

- హడావుడిగా గ్రూప్ 2 పరీక్ష కేంద్రాల వద్దకు చేరుకున్న అభ్యర్థులు
- రోస్టర్ సమస్య పరిష్కరించకుండా పరీక్షల నిర్వహణపై ఆగ్రహం
- చాలా మంది పరీక్షలకు గైర్హాజరు
- సరైన సమయంలో బుద్ధిచెప్తామంటున్న అభ్యర్థులు
- దాగుడుమూతలు ఆడిన కూటమి ప్రభుత్వం



ఒంగోలులోని క్విస్ ఇంజినీరింగ్ కాలేజ్ కేంద్రంలో పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు

ఒంగోలు సిటీ:

జిల్లాలో ఆదివారం నిర్వహించిన గ్రూప్ 2 పరీక్ష ప్రహసనంగా సాగింది. పరీక్ష వాయిదా అంటూ ప్రభుత్వం లీకులిస్తూ నిరుద్యోగుల జీవితాలతో ఆటలాడుకుంది. మూడు రోజులుగా అభ్యర్థులు గ్రూప్ 2 మెయిన్స్ వాయిదా వేయండి అని ప్రభుత్వానికి ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకున్న పాపాన పోలేదు. కేవలం ఉపాధ్యాయ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు బ్యాంకు కోసమే వాయిదా వేయకుండా పబ్బం గడుపుకుందని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా గ్రూప్ 2 మెయిన్స్ పరీక్ష కోసం ఒంగోలు, నగర శివారు ప్రాంతాల్లోని ఐదు కేంద్రాల్లో ఏడు సెంటర్లు ఏర్పాటు చేశారు. ఈ సెంటర్లలో 4,544 మంది అభ్యర్థులను కేటాయించారు. అన్ని కేంద్రాల వద్ద కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు చేసి పరీక్షలు నిర్వహించారు. మొత్తం 4544 మంది అభ్యర్థులకుగాను ఉదయం 3,968 (87.32%) మంది, మధ్యాహ్నం 3,965 (87.25%) మంది పరీక్షలకు హాజరయ్యారు.

కూటమికి బుద్ధి చెప్తామంటున్న అభ్యర్థులు

రెండు రోజులుగా కూటమి సీఎం చంద్రబాబు నాయుడు గ్రూప్-2 మెయిన్స్ వాయిదా వేస్తామని లీకులు ఇస్తూ పచ్చమీడియా తో తప్పుదోవ పట్టించాడని అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడుగా ఏపీపీఎస్సీ చైర్మన్ మాట వినడం లేదంటూ దొంగ నాటకాలు ఆడుతూ అభ్యర్థుల జీవితాలతో ఆడుకున్నారు. దీంతో అభ్యర్థులు సరైన సమయంలో తగిన గుణపాఠం చెప్తామని కరాఖండిగా ఉన్నారు.

పరీక్ష కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్, ఎస్పీ:
కలెక్టర్ తమీమ్‌అన్సారియా క్విస్ కాలేజీ, రైస్, పేస్ కాలేజీ సెంటర్లను తనిఖీ చేశారు. పరీక్షల్లో అభ్యర్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన పై కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. నాగార్జున డిగ్రీ కాలేజీ, హర్షిణి, క్విస్, పేస్ కాలేజీల సెంటర్లను జాయింట్ కలెక్టర్ గోపాలకృష్ణ రోణంకి తనిఖీ చేశారు. గ్రూప్ 2 భద్రతా ఏర్పాట్లను ఎస్పీ దామోదర్ స్వయంగా పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కేంద్రాల పరిసరాల్లోజిరాక్స్‌సెంటర్లు మూయించామని, రైల్వే, బస్ స్టేషన్ల వద్ద హెల్ప్ డెస్క్ లు ఏర్పాటు చేసినట్లు వివరించారు. పరీక్ష కేంద్రాల వద్ద డ్రోన్ ద్వారా కూడా భద్రత పర్యవేక్షించినట్లు తెలిపారు. పరీక్షలు ముగిసిన తరువాత పటిష్టమైన భద్రత మధ్య జవాబు పత్రాలను స్ట్రాంగ్ రూంకు తరలించినట్లు చెప్పారు. ఎస్పీ వెంట డీఎస్పీ రాయపాటి శ్రీనివాస రావు, తాలూకా సీఐ అజయ్ కుమార్, రూరల్ సీఐ శ్రీకాంత్ బాబు, మహిళా పోలీసు స్టేషన్ సీఐ సుధాకర్, సింగరాయకొండ సీఐ హజరత్తయ్య ఉన్నారు.



పరీక్ష కేంద్రాలను తనిఖీ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

“ తీర్పు తర్వాతే పరీక్షలు పెడితే బాగుండేది



రోస్టర్ వివాదం న్యాయస్థానంలో విచారణ జరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందుగానే ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం విచారకరం. చివరి నిమిషంలో ఏదో హడావుడి చేయడం కంటే న్యాయస్థానం నుంచి తీర్పు వచ్చిన తర్వాతనే గ్రూప్ 2 పరీక్షలు నిర్వహిస్తే ఎంతో బాగుండేది. గత రాత్రి వరకు కూడా పరీక్షలు జరుగుతాయో లేదో అనే ఆందోళనలో సరిగా చదవలేకపోయాం. మాకు జరిగిన నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారు.

– సుమంత్, గ్రూప్ 2 అభ్యర్థి

పరీక్షలకు మరింత సమయం ఇచ్చి ఉంటే బాగుండేది

గ్రూప్ 2 పరీక్షల విషయంలో రోస్టర్ వివాదం తలెత్తడంతో అసలు పరీక్షలు జరుగుతాయో లేదో అనే సందేహంతో అనేక మంది అభ్యర్థులు సరిగా ప్రిపేర్ కాలేదు. చివరి నిమిషం వరకు కూడా అభ్యర్థుల్లో పరీక్షలు జరుగుతాయన్న నమ్మకాన్ని ప్రభుత్వం కల్పించలేకపోయింది. ప్రభుత్వం గ్రూప్ 2 అభ్యర్థులకు ప్రిపేర్ కావడానికి మరికొంత సమయం ఇచ్చి ఉంటే బాగుండేది. ఈ విషయంలో ప్రభుత్వం విఫలమైంది.

– వెంకటేష్, గ్రూప్ 2 అభ్యర్థి

జిల్లా సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక

ఒంగోలు: సీనియర్ పురుషుల హాకీ జట్టు ఎంపిక ఆదివారం స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించారు. ఈ ఎంపిక ప్రక్రియను హాకీ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎ.సుందర రామిరెడ్డి ఆధ్వర్యంలో పరిశీలకులు చంద్రశేఖర్, టి.రవికుమార్, పి.రవి పర్యవేక్షించారు. ఎంపికైన జట్టు మార్చి 6 నుంచి 8వ తేదీ వరకు గుంటూరు జిల్లా నాగార్జున యూనివర్శిటీలో జరిగే రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో పాల్గొంటుందని అసోసియేషన్ కార్యదర్శి సుందరరామిరెడ్డి పేర్కొన్నారు. అనంతరం ఎంపికైన క్రీడాకారులను ఆయన అభినందించి రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ మంచి ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు.



ఎంపికైన సీనియర్ పురుషుల హాకీ జిల్లా జట్టు

ఎంపికైన జట్టు:
రాఘవేంద్ర, యువరాజ్, భాను ప్రకాష్, రాము, భరత్, శ్రీకాంత్, మోహన్, లక్ష్మీనారాయణ, వెంకటేశ్వర్లు, రాజేష్‌బాబు, వీరాంజనేయులు, కార్తీక్, గణేష్, బాలశివకుమార్, కాలేషా, మణికంఠ, సందీప్, అశోక్, సుధాకర్.

పొగాకులో నాణ్యత అంశాల పరిశీలన

నాగులుప్పలపాడు: పొగాకు పంటలో నాణ్యతా ప్రమాణాలపైనే బయ్యర్ల దృష్టి ఉంటుందని కర్ణాటక పొగాకు బోర్డు మాజీ వైస్ చైర్మన్ బసవరాజు తెలిపారు. ఆంధ్రా పొగాకు పంట నాణ్యత, దిగుబడి అంశాలను పరిశీలించేందుకు కర్ణాటక రాష్ట్రం నుంచి వచ్చిన బోర్డు సభ్యులతో కలిసి నిడమానూరు గ్రామంలో ఆదివారం పొగాకు తోటలను పరిశీలించారు. అనంతరం బ్యారన్ క్యూరింగ్, నాణ్యత వంటి వివరాలను స్థానిక రైతులను అడిగి తెలుసుకున్నారు. వారి వెంట బోర్డు సభ్యులు దినేష్ గౌడ, విక్రమ్ రాజ్ గౌడ, భారత పొగాకు బోర్డు సభ్యులు మారెడ్డి సుబ్బారెడ్డి, ఉన్నారు.



స్థానిక పొగాకు పంటను పరిశీలిస్తున్న కర్ణాటక బోర్డు సభ్యులు

ప్రాణాలకు ఉచ్చు

నల్లమల అభయారణ్యంలోని వన్యప్రాణులకు స్మగ్లర్ల నుంచి ముప్పు ఉంది. పులులు, చిరుతలను వేటాడి వాటి చర్మాలను ఇతర ప్రాంతాలకు తరలించేందుకు కొందరు స్మగ్లర్లు నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నారు. పటిష్టమైన భద్రత, నిఘా వ్యవస్థలున్నాయని అటవీ అధికారులు చెబుతున్నా వేటగాళ్ల బారి నుంచి వన్యప్రాణులను కాపాడలేకపోతున్నారు. ఈనెల 16వ తేదీ యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల బీట్‌లో వేటగాళ్ల ఉచ్చుకు చిరుత బలైన సంఘటనతో వన్యప్రాణుల భద్రత మరోసారి ప్రశ్నార్థకమైంది.

- వేటగాళ్ల దాడులతో ప్రాణాలు కోల్పోతున్న పులులు, వన్యప్రాణులు
- చిరుత మృతితో ఉలిక్కి పడిన అధికార యంత్రాంగం
- ఉచ్చులో ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న చిరుతను కాపాడలేని సిబ్బంది
- గత ఐదేళ్లలో 7 పులుల మృతి



కొలుకుల వద్ద వేటగాళ్ల ఉచ్చులో చిక్కుకుని మృతి చెందిన చిరుతపులి (ఫైల్)



నల్లమలలో తిరిగే పెద్దపులి (ఫైల్)

మార్కాపురం/యర్రగొండపాలెం/పెద్దదోర్నాల:



సందీప్ కృపాకర్, డిడి, మార్కాపురం

నల్లమల అటవీ ప్రాంతం సుమారు 6.50 లక్షల హెక్టార్లలో విస్తరించి ఉంది. ఈ ప్రాంతంలో 87కు పైగా రాయల్ బెంగాల్ టైగర్లు, సుమారు 100 కు పైగా చిరుతలు తిరుగుతున్నాయి. వీటితోపాటు వందల సంఖ్యలో దుప్పులు, జింకలు, నీల్‌గాయ్‌లు, ఎలుగుబంట్లు ఉన్నాయి. పులుల సంరక్షణకు అటవీ శాఖాధికారులు చర్యలు చేపడుతున్నప్పటికీ వేటగాళ్లు పన్నుతున్న ఉచ్చుల్లో అడవి పందులతోపాటు వన్యప్రాణులు బలవుతున్నాయి. యర్రగొండపాలెం మండలంలోని కొలుకుల బీట్‌లో ఈనెల 15వ తేదీ వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులో పడి చిరుత మృతి చెందడం చర్చనీయాంశమైంది. దీంతో నల్లమల అటవీ ప్రాంతంలో గత ఐదేళ్లలో 7 పులులు మృతి చెందినట్టైంది.

కఠినతరమైన చట్టాలున్నా.. ఆగని వన్యప్రాణుల వేట

వన్య ప్రాణులు, అటవీ సంరక్షణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చట్టం ప్రవేశపెట్టింది. 1973 మార్చి 1న దానిని అమలులోకి తెచ్చింది. అప్పటి నుంచి శిక్షలు కఠినతరం చేస్తూ ప్రత్యేక చట్టాలు అనుసంధానిస్తూ వస్తున్నా.. వన్యప్రాణుల మరణాలు మాత్రం ఆగడం లేదు. వన్యప్రాణులను వేటాడితే నాన్‌బెయిలబుల్ కేసు నమోదు, అభయారణ్యంలో అనుమతి లేకుండా ప్రవేశిస్తే ఎన్నో రకాలుగా క్రిమినల్ కేసులు ఉంటాయి. పులుల అభయారణ్యంలోని వన్య ప్రాణులను వేటాడితే 2006-యాక్టు ప్రకారం శిక్షలు కఠినంగానే ఉంటాయి. దీంతో పాటు అక్రమంగా ఆయుధాలు కలిగి ఆరణ్యంలోకి ప్రవేశించడం, వన్యప్రాణుల ప్రశాంతతకు విఘాతం కలిగించినా కేసులు నమోదు చేసి శిక్షలు విధిస్తారు. 2002 జీవవైవిధ్య పరిరక్షణ చట్టం ప్రకారం అరుదైన, సంరక్షక వృక్ష, జంతుజాలం సంచరించే ప్రాంతాల్లోకి అనుమతులు లేకుండా వెళ్లినా, వాటికి హాని కలిగించినా శిక్షలు తప్పవు. నాన్ బెయిలబుల్ వారెంట్‌తో పాటు రూ.10 లక్షల వరకు జరిమానా ఉంటుంది. అయితే ఇంతటి కఠినతరమైన చట్టాలు అమలులో ఉన్నా వన్య ప్రాణులపై దాడులు జరుగుతూనే ఉన్నాయి. వేటగాళ్లు కొన్ని వన్యప్రాణుల కోసం వేసే ఉచ్చులతో చిరుతలు, పెద్దపులులు అంతమవుతున్నాయి.

జనారణ్యంలోకి వన్యప్రాణులు

ఇటీవల కాలంలో చిరుతలు, పెద్దపులులు, ఎలుగుబంట్లు జనారణ్యంలోకి వస్తున్నాయి. మార్కాపురానికి చుట్టుపక్కల నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న పెద్దదోర్నాల, పుల్లలచెరువు, యర్రగొండపాలెం, పెద్దారవీడు, అర్ధవీడు, గిద్దలూరు తదితర మండలాల్లో ఉన్న అటవీ సమీప గ్రామాల్లోకి పెద్దపులులు, చిరుతలు, ఎలుగుబంట్లు ఆహారం కోసం, రోడ్డు దాటుతూ జనావాసాల్లోకి వచ్చి ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఇదే సమయంలో అవి గేదెలు, ఆవులు, ఎద్దులపై దాడిచేసి తింటున్నాయి. పెద్దదోర్నాల మండలంలోని నల్లగుంట్ల, వై చర్లోపల్లి, తుమ్మలబైలు, శ్రీశైల శిఖరం, బొమ్మలాపురం, ఘాట్‌రోడ్డు, అర్ధవీడు మండలంలోని వెలగలపాయ, మాగుటూరు తాండ, గన్నెపల్లి, లక్ష్మీపురం, దొనకొండ, మార్కాపురం మండలం గొట్టిపడియ, పెద్దారవీడు మండలం గుండంచర్ల తదితర గ్రామాల శివార్లలో చిరుతలు, పెద్దపులులు వస్తున్నాయి. ఇదే సమయంలో గిద్దలూరు - నంద్యాల మధ్య ఉన్న అటవీ ప్రాంతంలో రాత్రిపూట చిరుతలు, పెద్దపులులు వచ్చి రైలును ఢీకొని ప్రాణాలు విడుస్తున్నాయి. వీటితోపాటు పొలాల్లో రైతులు అడవి పందుల బెడద నుంచి పంటలను కాపాడుకునేందుకు ఏర్పాటు చేసిన విద్యుత్‌తీగలు తగిలి చిరుత పులులు మృతిచెందుతున్నాయి. ఇక జింకలు కూడా జనావాసాల్లోకి వచ్చి మృత్యువాత పడుతున్నాయి.



వన్యప్రాణుల కోసం ఉచ్చు వేసిన నిందితుడిని గాలిస్తున్న డాగ్ స్క్వాడ్ (ఫైల్)

శనివారంపై దృష్టి సారించని అటవీశాఖాధికారులు

నల్లమల అభయారణ్య పరిధిలో ఉన్న గ్రామాలపై అధికారులు దృష్టి సారించాల్సి ఉంది. కనీసం వారంలో ఒక్క శనివారం అయినా అటవీ శాఖ సిబ్బంది ప్రత్యేక నిఘా ఉంచితే వన్యప్రాణులను కాపాడినవారవుతారు. సహజంగా వేటగాళ్లు అడవి పందులు, జింకలు, కణితులు, కొండ గొర్రెలు, కుందేళ్లు లాంటి అటవీ జంతువులతోపాటు పక్షులను వేటాడేందుకు ప్రతి శనివారం అడవుల్లోకి వెళ్లి ఉచ్చులు ఏర్పాటు చేస్తారు. ఆదివారం వేకువ జామునే వారు ఆయా ప్రాంతాలకు వెళ్లి ఉచ్చులో చిక్కుకున్న ప్రాణులను పట్టుకొని వాటి మాంసాన్ని అమ్ముకుంటుంటారు. ఈ తంతు బహిరంగ రహస్యమైనా అటవీ శాఖాధికారులకు మాత్రం పట్టదని పలువురు విమర్శిస్తున్నారు. పెద్దదోర్నాల, యర్రగొండపాలెం, పుల్లలచెరువు, పెద్దారవీడు మండలాల్లోని కొన్ని గ్రామాలకు చెందిన వేటగాళ్లు వన్యప్రాణులను వేటాడి వాటి మాంసాన్ని విక్రయించటమే ఉపాధిగా మార్చుకున్నారు.



కణితిని వేటాడిన నిందితులతో ఫారెస్ట్ అధికారులు (ఫైల్)

వన్యప్రాణులదీ ఇదే పరిస్థితి

- గత ఏడాది డిసెంబరు 27న ఒంగోలు సమీప పొలాల్లో జింక రైతులకు చిక్కడంతో వారు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో జింకల పార్కుకు తరలించారు.
- 2023 డిసెంబరులో పొదిలి మండలం కంభాలపాడు వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని జింక మృతి చెందింది.
- 2023 డిసెంబరు 23 దోర్నాల మండలం జమ్మిదోర్నాల వద్ద కుక్కల దాడిలో కృష్ణజింక మృతి చెందింది.

ఉచ్చులో చిక్కుకున్న చిరుతను కాపాడలేని సిబ్బంది

యర్రగొండపాలెం మండలం కొలుకుల సమీపంలో ఈనెల 15వ తేదీ రాత్రి వేటగాళ్లు ఏర్పాటు చేసిన ఉచ్చులో చిక్కుకుని ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న చిరుత పులిని అటవీ శాఖ సిబ్బంది కాపాడలేకపోయారు. వారి కళ్లముందే మరుసటి రోజు ఆ చిరుత ప్రాణాలు వదిలింది. అటువంటి సంఘటనలు చోటు చేసుకున్న సమయంలో ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వడం, వారి అనుమతి కోసం ఎదురు చూడటం ఏంటని పర్యావరణ ప్రేమికులు ప్రశ్నిస్తున్నారు. ఉచ్చులో చిరుత పులి చిక్కుకొని తప్పించుకోవటానికి తీవ్రంగా ప్రయత్నించింది. తనను రక్షించేందుకు ఎవరైనా వస్తారేమోనని అరవడం మొదలు పెట్టింది. దాని గాండ్రింపులు విన్న సమీప గ్రామస్తులు అటవీ శాఖాధికారులకు సమాచారం ఇచ్చారు. ఆలస్యంగా అయినా స్పందించిన వారు సంఘటన స్థలానికి వెళ్లారేతప్ప ఆ చిరుతను రక్షించేందుకు ప్రయత్నించలేదని పలువురు తెలిపారు. ఉచ్చువేసిన వేటగాడు చిరుతను కాపాడటానికి అక్కడికి వెళ్లి ఇరువైపులా ఉచ్చులకు కట్టిన తాళ్లను తెంచివేశాడు. అటువంటి సమయంలో నిస్సహాయస్థితిలో ఉన్న దానిని గ్రామస్తుల సహకారంతో రక్షించేందుకు సిబ్బంది ప్రయత్నించకుండా ఉన్నతాధికారుల రాక కోసం ఎదురు చూస్తూ కాలం గడిపారు. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న చిరుత ఉన్న ప్రాంతానికి వెళ్లేందుకు వారు అనుమతి ఇవ్వలేదు. చివరకు ఆ చిరుత ప్రాణాలు వదిలింది. ఇప్పటికైనా అధికారులు అటవీ ప్రాంతాలపై దృష్టి సారించి వేటగాళ్ల బారి నుంచి వన్యప్రాణులను కాపాడాలని పలువురు కోరుతున్నారు.

మృత్యువాత పడుతున్న పులులు, చిరుతలు

- ఈ ఏడాది ఫిబ్రవరి 16వ తేదీన యర్రగొండపాలెం మండలం కొలుకుల సమీపంలో వేటగాళ్ల ఉచ్చులో పడి చిరుతపులి మృతి చెందింది.
- గతేడాది అర్ధవీడు మండలం వెలగలపాయ సమీపంలో విద్యుత్ కంచె తగిలి చిరుత మృతి చెందింది.
- 2023 నవంబరు 10న శ్రీశైలం ఘాట్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని చిరుత మృతి చెందింది.
- అదే ఏడాది రోడ్డు దాటుతున్న ఏడాదిన్నర వయస్సున్న చిరుతపులి పిల్ల గుర్తుతెలియని వాహనం ఢీకొని మృత్యువాత పడింది.
- 2022 జనవరి 6న దోర్నాల మండలం రోళ్లపెంట సమీపంలో బావిలో పడి చిరుతపులి ప్రాణాలు కోల్పోయింది.
- 2021 నవంబరు 12న గిద్దలూరు-నంద్యాల మధ్య చలమ రైల్వేస్టేషన్ సమీపంలో రైల్వేట్రాక్ దాటుతూ ప్రమాదవశాత్తు రైలు కిందపడి పెద్దపులి మృతి చెందింది.
- 2020 ఏప్రిల్‌లో యర్రగొండపాలెం సమీపంలోని గాలికొండ అటవీ ప్రాంతంలో వృద్ధాప్యంతో తీవ్రమైన ఎండ వేడిమి తట్టుకోలేక పెద్దపులి చనిపోయింది.

క్లుప్తంగా

యువకుడి మృతదేహం లభ్యం

దర్శి(కురిచేడు): నాగార్జున సాగర్ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డ పుష్పాల వీరనారాయణ(17) మృతదేహం లభ్యమైంది. సాగర్ కాలువలో పొదిలి రోడ్డులోని విద్యుత్ తయారీ కేంద్రం సమీపంలో మృతదేహం గోడకు తగిలి నిలిచిపోయింది. కాగా శనివారం అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసిన ఎస్సై మురళి తనసిబ్బందితో కాలువపై గాలింపు చేస్తుండగా ఆదివారం మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని వెలికితీసి పంచనామా చేసి పోస్టుమార్టం అనంతరం మృతునికుటుంబ సభ్యులకు అప్పగించారు. వీరనారాయణ మృతికి కారణాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి



మృతి చెందిన గురవయ్య

యర్రగొండపాలెం: ద్విచక్రవాహనం అదుపుతప్పి వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన స్థానిక ఫారెస్ట్ ఆఫీస్‌కు సమీపంలో ఆదివారం జరిగింది. పుల్లలచెరువు మండలంలోని కొమరోలుకు చెందిన పి.గురువయ్య(28) పనుల నిమిత్తం మోటారు బైక్‌పై యర్రగొండపాలెం వచ్చాడు. అక్కడ పనులు ముగించుకొని తిరిగి స్వగ్రామం వెళ్తున్న సమయంలో హైవే రోడ్డుపై ఇద్దరు నడుచుకుంటూ వెళ్తున్నారు. వారిని తప్పించే క్రమంలో ప్రమాదవశాత్తు బైక్ బోల్తా పడింది. తీవ్రగాయాలతో ఉన్న గురవయ్యను 108అంబులెన్స్‌లో స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే గురవయ్య మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై పి.చౌడయ్య తెలిపారు.

25 నుంచి రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు



గ్రౌండ్ పనులు పరిశీలిస్తున్న శ్రావణి తదితరులు

పొదిలి: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈ నెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకు రాష్ట్రస్థాయి మహిళా కబడ్డీ పోటీలు నిర్వహించనున్నట్లు శ్రీకృష్ణ దేవరాయ సాంస్కృతిక సంస్థ చైర్మన్ శ్రావణి వెంకటేశ్వర్లు తెలిపారు. స్థానిక దర్శి రోడ్డులోని ఆర్టీసీ స్థలంలో పోటీలు నిర్వహించేందుకు అవసరమైన గ్రౌండ్ సిద్ధం చేస్తున్నారు. ఈ పనులను పరిశీలించిన శ్రావణి వెంకటేశ్వర్లు ఆదివారం పోటీల వివరాలను గురించి వెల్లడించారు. శివరాత్రి రోజున రాత్రి జబర్దస్త్ నటులు, ఢీ జోడీ విన్నర్స్‌తో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆవుల పాపారావు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ చెరుకూరి పుల్లయ్య, సింగంశెట్టి శివ, పయ్యావుల గురవయ్య, పాతాలపు కిశోర్, పాశం కొండయ్య, సిరిగిరి కళ్యాణ్, గుద్దేటి కాలయ్య, జూలేరు బూసిరెడ్డి పాల్గొన్నారు.

అంతా హడావుడిగా..

గ్రూప్–2 మెయిన్స్ పరీక్ష ముగిసింది. అసలు పరీక్ష ఉంటుందా..ఉండదా..? అన్న సందిగ్ధంలోనే అభ్యర్థులంతా శనివారం వరకు ఉన్నారు. రాత్రి బాగా పొద్దుబోయిన తరువాత పరీక్ష యధావిధిగా జరుగుతుందని ప్రకటన రావడంతో అభ్యర్థులు ఆదివారం పరీక్ష కేంద్రానికి హడావుడిగా చేరుకోవాల్సి వచ్చింది. కొన్ని జిల్లాల్లో అభ్యర్థుల ఆందోళన నేపథ్యంలో జిల్లాలోని 7 పరీక్ష కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లు చేశారు.

- సాక్షి, ఒంగోలు



దివ్యాంగ అభ్యర్థి వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు





జీవితంలో నిలదొక్కుకునేందుకు: పరీక్ష రాసేందుకు వస్తున్న దివ్యాంగ అభ్యర్థి



భర్తకు తోడుగా...



పరీక్ష బాగా రాసి రా అమ్మా..



గ్రూపు-2 పరీక్ష రాసేందుకు వస్తున్న అభ్యర్థులు



ఆల్ ది బెస్ట్...



పరీక్ష రాసేందుకు వస్తున్న గర్భిణి



సమయం మించిపోతుంది. త్వరగా పదా..



అమ్మ పరీక్ష ఎలా రాస్తుందో..?





సమయం ముగిసి కేంద్రంలోకి అనుమతించకపోవడంతో విలపిస్తున్న అభ్యర్థి

క్రీడలతో మానసిక ఉల్లాసం



వాలీబాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు



బహుమతులు అందజేస్తున్న నెహ్రూ యువకేంద్ర జిల్లా కో ఆర్డినేటర్ కమల్‌సా

- నెహ్రూ యువ కేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ కమల్‌సా

ఒంగోలు: క్రీడలతో మానసిక దృఢత్వం లభిస్తుందని నెహ్రూ యువకేంద్రం జిల్లా కో ఆర్డినేటర్ కమల్‌సా అన్నారు. స్థానిక డీఆర్ఆర్ఎం మున్సిపల్ ఉన్నత పాఠశాల ఆవరణలో నెహ్రూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లాస్థాయి వాలీబాల్, కబడ్డీ, పరుగు పోటీలను ఆయన ప్రారంభించారు. తొలుత పోటీలను బ్లాక్ లెవల్‌లో జిల్లాలో నిర్వహించామని, అక్కడ విజేతలైన వారు క్లస్టర్ లెవల్ పోటీలు నిర్వహించామని, క్లస్టర్ లెవల్ విజేతలకు జిల్లాస్థాయి పోటీలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఫిట్ ఇండియా స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ శారీరక, మానసికంగా బలీయంగా ఉండి దేశానికి యువ శక్తిని గ్రామ స్థాయి నుంచి అందించాలనే సంకల్పంతో పోటీలను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. స్టెప్ మేనేజర్ శ్రీమన్నారాయణ మాట్లాడుతూ నెహ్రూ యువకేంద్రం యువత ఆధారంగా కార్యక్రమాలు నిర్వహించడం, వాటికి లభిస్తున్న స్పందన అద్భుతమన్నారు. ప్రతి ఒక్కరూ అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని రాష్ట్ర, జాతీయ స్థాయిలో విజేతలుగా గుర్తింపు పొందాలన్నారు. కబడ్డీ విజేత ఆర్జియూ కేటీ, వాలీబాల్ విజేత ఒంగోలు క్విజ్ కాలేజీ జట్లకు, పరుగుపందెం విజేతలకు బహుమతులు, ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు.

ఆరోగ్యశ్రీలో మరింత నాణ్యమైన వైద్య సేవలు



నూతన భవనాన్ని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

ఒంగోలు టౌన్ : ప్రజలకు ఆరోగ్యశ్రీ ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసినట్లు హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోతినేని రమేష్ బాబు చెప్పారు. ఆదివారం నగరంలోని సౌత్ బైపాస్‌లోని ఆస్టర్ రమేష్ హాస్పిటల్లో నూతన భవనాన్ని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి ప్రారంభించారు. ఈ సందర్భంగా పోతినేని మాట్లాడుతూ ఒంగోలులో గత 8 ఏళ్లుగా వైద్య సేవలందిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రజల అభిష్టాన్ని దృష్టిలో ఉంచుకొని ఇప్పటికే ఉన్న 150 పడకలకు అదనంగా మరో 100 పడకలతో హాస్పిటల్ ను విస్తరించినట్లు చెప్పారు. తద్వారా ఆరోగ్యశ్రీ లో అత్యున్నత స్థాయి వైద్య సేవలను జిల్లా ప్రజలకు అందుబాటులోకి తెచ్చినట్లు చెప్పారు. స్పెషాలిటీ, సూపర్ స్పెషాలిటీ వైద్యంతో పాటుగా బర్త్ అండ్ బియాండ్ పేరుతో తల్లీ పిల్లల వైద్య విభాగాన్ని ప్రత్యేకంగా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆరోగ్య సేవలను మరింత మెరుగు పరిచేందుకు పలు వినూత్న కార్యక్రమాలను చేపట్టినట్లు వివరించారు. జిల్లా ప్రజలకు ఆధునిక కార్పొరేట్ వైద్యం అందించడానికి ఆస్టర్ రమేష్ ముందుకు రావడం అభినందనీయమని మంత్రి వీరాంజనేయ స్వామి చెప్పారు. డీఎంఅండ్ హెచ్ ఓ డాక్టర్ వెంకటేశ్వర్లు, హాస్పిటల్స్ డైరెక్టర్ మధుస్మిత, చైర్మన్ మద్దిపాటి సీతా రామమోహన్ రావు, రీజనల్ సీఈఓ దేవానంద్, డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మమత రాయపాటి తదితరులు పాల్గొన్నారు.

పరీక్షల విధుల్లో అలసత్వం వహించొద్దు



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



ఇంటర్మీడియెట్ పరీక్షల విధుల్లో పాల్గొనే వివిధ శాఖల అధికారులు

- కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్షల నిర్వహణ విధుల్లో ఎంత మాత్రమూ అలసత్వం, నిర్లక్ష్యం వహించరాదని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. ఏకేవీకే డిగ్రీ కళాశాలలో ఇంటర్మీడియెట్ పరీక్షల విధుల్లో పాల్గొనే చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్టుమెంటల్ అధికారులు, కస్టోడియన్లు, అడిషనల్ చీఫ్ సూపరింటెండెంట్లు, స్క్వాడ్ సభ్యులకు ఆదివారం జరిగిన శిక్షణ కార్యక్రమానికి కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆయా కేంద్రాల పరీక్షల నిర్వహణలో మీదే కీలక పాత్ర అన్నారు. పరీక్ష కేంద్రంపై చీఫ్ సూపరింటెండెంట్లు పూర్తి అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించాలని చెప్పారు. విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసిన తరువాతే పరీక్ష కేంద్రంలోకి అనుమతించాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరాదన్నారు. తనిఖీలు, పరీక్షల నిర్వహణలో పకడ్బందీగా ఉండాలని, అలాగని విద్యార్థులు ఒత్తిడికి గురయ్యేలా వారి పట్ల అనుచితంగా వ్యవహరించరాదని చెప్పారు. తమ కేంద్రాల్లో పరీక్షలు సజావుగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా చూడాల్సిన బాధ్యత చీఫ్ సూపరింటెండెంట్లదేనన్నారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో విధులు నిర్వహించే సిబ్బంది మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించి జిల్లా యంత్రాంగానికి అప్రతిష్ట తీసుకువస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. పరీక్షల నిర్వహణకు సమయం ఉన్నందున ఆయా పరీక్ష కేంద్రాలపై అవగాహన కోసం ముందుగానే వెళ్లి పరిశీలించాలని అందరికీ దిశానిర్దేశం చేశారు. హాల్ టికెట్లపై విద్యార్థులు చదువుతున్న కాలేజీల ప్రిన్సిపాల్ సంతకం కచ్చితంగా ఉండాలనే నిబంధన ఏమీ లేదన్నారు. హాల్ టికెట్లు మంజూరు చేయాలంటే పెండింగులో ఉన్న కాలేజీ / మెస్ ఫీజు చెల్లించాలని విద్యార్థులపైన ప్రైవేట్ కాలేజీలు ఒత్తిడి తెస్తే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాట్సప్ ద్వారా విద్యార్థులు తమ హాల్ టికెట్లను ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని కలెక్టర్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్.ఐ.ఓ. సైమన్ విక్టర్, ఇంటర్మీడియెట్ పరీక్షల స్పెషల్ ఆఫీసర్ ఐ.శ్రీనివాస రావు, ఎగ్జామ్స్ కంట్రోలర్ వి.వి.సుబ్బారావు, జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు ఆంజనేయులు, చంద్రశేఖర్, కోటేశ్వరరావు, స్వరూప రాణి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

వైవీ సుబ్బారెడ్డిని కలిసిన నేతలు



వైవీ సుబ్బారెడ్డిని సన్మానిస్తున్న కేవీ రమణారెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు

ఒంగోలు సిటీ: రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డిని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కేవీ రమణారెడ్డి ఆదివారం మర్యాదపూర్వకంగా ఒంగోలులో కలిశారు. అదే విధంగా మాజీ ఎమ్మెల్యే, మార్కాపురం ఇన్‌చార్జి అన్నా రాంబాబు వైవీ సుబ్బారెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయన వెంట మాజీ ఏఎంసీ చైర్మన్ వై.వెంకటేశ్వరరావు ఉన్నారు.

25న మెగా జాబ్‌మేళా

సంతనూతలపాడు: మండలంలోని ఎండ్లూరు డొంక వద్ద ఉన్న మహిళా ప్రాంగణంలో ఈ నెల 25 మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జె.రవితేజ యాదవ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నామన్నారు. నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఆదర్శ పాఠశాలపై ఫిర్యాదుల పరంపర

- మధ్యాహ్న భోజనం బాగా లేదని డీఈఓకు విద్యార్థుల ఫిర్యాదు
- ప్రిన్సిపాల్, బోధనేతర సిబ్బంది నిర్లక్ష్యంపై ఎస్ఎంసీ చైర్మన్ ఫిర్యాదు
- కనిగిరి ఆదర్శ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేసిన డీఈఓ
- విధులకు డుమ్మాకొట్టిన ప్రిన్సిపాల్‌పై డీఈఓ ఆగ్రహం



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ, డిప్యూటీ డీఈఓలు, ఎంఈఓలు

కనిగిరిరూరల్: 'సార్..మధ్యాహ్న భోజనం ఏం బాగాలేదు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు. తీవ్ర అవస్థలతో చదువుకుంటున్నాం..' అంటూ కనిగిరి ఆదర్శ పాఠశాల విద్యార్థులు డీఈఓ కిరణ్‌కుమార్ వద్ద తమ గోడు వెళ్లబోసుకున్నారు. కనిగిరి ఆదర్శ పాఠశాలను డీఈఓ కిరణ్‌కుమార్ ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, హాజరుపట్టిని ఆయన పరిశీలించారు. డిసెంబర్‌లో ప్రిన్సిపాల్‌గా విధుల్లో చేరిన నాటి నుంచి సక్రమంగా పాఠశాలకు రాకుండా..ఎటువంటి అనుమతులు లేకుండా విధులకు డుమ్మా కొడుతున్నట్లు గుర్తించిన డీఈఓ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాలల్లో బోధనేతర సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని, విద్యార్థులు క్రమశిక్షణ తప్పి గొడవలకు దిగుతున్నారని.. ఇప్పటికీ ఎన్నోసార్లు ఇంటర్, పదో తరగతి విద్యార్థుల మధ్య వివాదాలు జరిగాయని, బాలురు.. బాలికల పట్ల అసభ్యకరంగా వ్యవహరిస్తున్నారని పాఠశాల ఎస్ఎంసీ కమిటీ చైర్మన్ పందిటి మోహన్, మాజీ చైర్మన్ గోపిశెట్టి చెన్నారావు డీఈఓకు ఫిర్యాదు చేశారు. అనంతరం డీఈఓ మోడల్ స్కూల్‌లోని విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. వసతి గృహంలో భోజనం సక్రమంగా లేదని విద్యార్థులు విన్నవించారు. దీంతో కుకింగ్ సిబ్బందిని పిలిచి మాట్లాడి భోజనం మెనూ ప్రకారం ఎందుకు అమలు చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రిన్సిపాల్ నిర్లక్ష్యం, అలసత్వంపై ఉన్నతాధికారులకు నివేదికిస్తున్నట్లు తెలిపారు. డిప్యూటీ డీఈఓలు చంద్రమౌళేశ్వరరావు, ఆర్ శామ్యూల్ జాన్, ఎంఈఓల సంఘ అధ్యక్షుడు దేవిరెడ్డి రామిరెడ్డి, ఎంఈఓలు రాజాల కొండారెడ్డి, యువీ నారాయణరెడ్డి, జి.సంజీవి, ఆర్ శ్రీనివాసులు, బి.నరసింహారావు, రంగయ్య, ఎం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని మృతి

ఒంగోలు టౌన్: ఒంగోలు రైల్వే స్టేషన్లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. జీఆర్పీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటల ప్రాంతంలో ఒకటో నంబర్ ప్లాట్‌ఫాం దిగువ లైన్లో సుమారు 60 ఏళ్ల వయసున్న వ్యక్తి మరణించారు. ఫుల్ హ్యాండ్ షర్ట్, గళ్ల లుంగీ ధరించి వున్నాడు. మృతుడు ఒంగోలు పరిసరాలు, తిరుపతి, మంగళగిరి ప్రాంతాలకు చెందిన వ్యక్తిగా పోలీసులు భావిస్తున్నారు.

వాహనం ఢీకొని వ్యక్తి మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై అంకమరావు

మార్కాపురం: రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని బొడిచర్ల గ్రామ సమీపంలో జరిగింది. వివరాల్లోకి వెళితే..బొడిచర్ల గ్రామానికి చెందిన బండి సునీల్(21) కంభం వైపుకు వెళ్తుండగా బొలెరో వాహనం ఢీకొట్టడంతో తలకు తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది వాహనంలో ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి మృతి చెందాడు. మృతుని తల్లి మరియమ్మ రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్సై అంకమరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.